
సాక్షి మహబూబ్‌నగర్

శనివారం, 30, ఆగస్టు, 2025



మళ్లీ పెరిగిన వరద

ఎగువ నుంచి వస్తున్న వరద శుక్రవారం మళ్లీ పెరగడంతో జూరాల 24 గేట్లు, కేఎస్పీ 2 గేట్లు ఎత్తి నీటి విడుదల చేశారు.

-8లో ▸



పీయూలో రాష్ట్రస్థాయి పోటీలు

పాలమూరు యూనివర్సిటీలో శనివారం 11వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ప్రారంభం కానున్నాయి.

-8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.7 /21.8

వాతావరణం

ఉదయం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

1న ఉద్యోగుల పెన్షన్ విద్రోహ దినం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సెప్టెంబర్ 1వ తేదీన ఉద్యోగుల పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు టీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, టీఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి చంద్రనాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీన స్థానిక టీఎన్‌జీఓ హాల్‌లో సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని, 1వ తేదీన కలెక్టరేట్‌కు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, పెన్షనర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నేడు (శనివారం) నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుజాత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 99592 26295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

మంచి ఆరోగ్యానికి క్రీడలు దోహదం



మహబూబ్‌నగర్ క్రీడలు: మంచి ఆరోగ్యానికి క్రీడలు, నిరంతర వ్యాయామం ఎంతో దోహదం చేస్తాయని డీడబ్ల్యూఓ జరీనా బేగం అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జాతీయ క్రీడాదినోత్సవం వేడుకలు నిర్వహించారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలు ఆడే వారిలో విల్‌పవర్ పెరుగుతుందన్నారు. ప్రతి రోజు పది నిమిషాల పాటు మెడిటేషన్ చేయాలని కోరారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడాకారులు ప్రతిభచాటాలని పిలుపునిచ్చారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని స్టేడియంలో వాలీబాల్ అకాడమీ ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో క్రీడాశాఖ సూపరింటెండెంట్ రాజ్‌గోపాల్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, కోచ్‌లు సునీల్‌కుమార్, పర్వేజ్‌పాష, అంజద్, ఖేలో ఇండియా ఫుట్‌బాల్ కోచ్ నికేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అతిచిన్న జీపీ.. శంకరాయపల్లి తండా

- గ్రామంలో 66మంది ఓటర్లు మాత్రమే..

జడ్చర్ల టౌన్: గ్రామపంచాయతీ వార్డుల వారీగా అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే జడ్చర్ల మండలంలోని శంకరాయపల్లి తండా పంచాయతీలో కేవలం 66 మంది ఓటర్లు మాత్రమే ఉండటం గమనార్హం. 2016–17లో శంకరాయపల్లి తండాను ప్రభుత్వం గ్రామపంచాయతీగా మార్చి అనుబంధ గ్రామంగా శంకరాయపల్లిని చేర్చారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో శంకరాయపల్లి తండాను జడ్చర్ల మున్సిపాలిటీలో విలీనం చేశారు. శంకరాయపల్లి మాత్రం శంకరాయపల్లి తండా జీపీ పేరుతోనే కొనసాగుతోంది. విభజన సమయంలో పక్కనే ఉన్న బండమీదిపల్లిలో శంకరాయపల్లిని విలీనం చేసి ఉంటే సమస్య వచ్చేది కాదు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 66మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. దీంతో రాష్ట్రంలోనే అతి చిన్న పంచాయతీగా రికార్డుకెక్కింది. గ్రామంలో మొత్తం 14ఇళ్లు ఉండగా.. 90మంది జనాభా ఉంది. 8 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో 8మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా యాదవ కులానికి చెందిన వారే కావడం విశేషం.



సీఎం ఇలాకాలో భూసేకరణం!

'కొడంగల్–నారాయణపేట'కు అడుగడుగునా అడ్డంకులు



కాన్‌కుర్తిలో సర్వేను అడ్డుకొని రాస్తారోకో చేస్తున్న భూ నిర్వాసిత రైతులు

- తొలి దశలో భూసేకరణ లక్ష్యం 1,957 ఎకరాలు
- 3 నెలలుగా సేకరించింది 597 ఎకరాలే..
- కాట్రేవులపల్లి నుంచి కాన్‌కుర్తి వరకు మిన్నంటిన నిరసనలు
- పరిహారం పెంచే వరకూ ఆందోళనలు తప్పవని రైతుల హెచ్చరిక

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి గ్రహణం వీడడం లేదు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ ప్రాజెక్టుకు రూపకల్పన జరిగినా.. అప్పుడు, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంలోనూ అనేక అవాంతరాలతో అడుగు ముందుకు పడలేదు. ఎట్టకేలకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ఈ పథకం అమలుకు కృషి చేసిన ఉమ్మడి పాలమూరుకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ ఎత్తిపోతలు మళ్లీ పురుడు పోసుకున్నాయి. అయితే.. పరిహారం పెంచాలనే డిమాండ్‌తో భూ నిర్వాసితులు చేపట్టిన ఆందోళనలు మిన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎత్తిపోతలకు అడ్డంకులు.. భూసేకరణలో ప్రగతిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

ఉమ్మడి ఏపీలో రూపకల్పన..

నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 1.05 లక్షల ఎకరాలకు సాగు నీరు.. 5.50 లక్షల జనాభాకు తాగు నీరందించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో 2014లో జీఓ 69తో పరిపాలన అనుమతులు జారీ చేశారు. రూ.133 కోట్ల నిధులు విడుదల చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అప్పటికే నిర్మించిన రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకానికి కేటాయించిన నికర జలాలను ఈ ఎత్తిపోతలకు వినియోగించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

డిజైన్‌లో మార్పు.. అయినా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగా.. జీఓ 69 అమలు కోసం రైతులు, మేధావులు, ప్రతిపక్షాలు, జలసాధన సమితి నేతలు ఉద్యమాలు చేశారు. కానీ అప్పటి ప్రభుత్వం ఈ పథకం డిజైన్ మార్చింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ ద్వారా నారాయణపేట, కొడంగల్ సెగ్మెంట్లలో 1.80 లక్షల ఎకరాలకు సాగు నీరందేలా ప్రణాళికలు రూపొందించినా.. అమలుకు నోచుకోలేదు.

ఎట్టకేలకు గత ఏడాది శంకుస్థాపన..

2023లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. పాత డిజైన్ ప్రకారం కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతలకు మళ్లీ అడుగు పడింది. రూ.4,369 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 21న అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కోస్గిలో నిర్వహించిన బహిరంగసభలో ప్రకటించడంతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ మేరకు జూరాల బ్యాక్ వాటర్ నుంచి నాలుగు టీఎంసీల నీటిని నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతలకు వినియోగించనున్నారు.

2 ప్యాకేజీలుగా పనులు..

ఎత్తిపోతల్లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని భూత్పూర్ నుంచి కానుకుర్తి చెరువు వరకు రెండు ప్యాకేజీల్లో అప్రోచ్ కాల్వలు, పంప్‌హౌస్‌లు, ప్రెషర్ మెయిన్లు, లీడ్ చానెల్, డెలివరీ సిస్టర్న్‌లతో పాటు సివిల్, ఎలక్ట్రిక్ పనులు చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీకి రూ.1,134.62 కోట్లు, రెండో ప్యాకేజీకి రూ.1,126.23 కోట్లు.. మొత్తం రూ.2,260.85 కోట్లు కేటాయించారు. మొత్తంగా 207 మెగావాట్ల సామర్థ్యం గల ఏడు పంప్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా.. 2026 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. మలి దశలో కానుకుర్తి నుంచి కొడంగల్ నియోజవర్గ పరిధిలోని బొంరాస్‌పేట మండలంలోని చెరువు వరకు నీటిని తరలించనున్నారు. దీనికి టెండర్లు పిలవాల్సి ఉంది.

350 మంది రైతులకు పరిహారం అందజేత..

తొలి రెండు ప్యాకేజీల పనుల కోసం నారాయణపేట జిల్లాలోని మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,957 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ ఏడాది జూన్‌లో సేకరణ చేపట్టగా.. ఇప్పటివరకు 590 ఎకరాల్లో మాత్రమే సర్వే పూర్తయింది. 134 ఎకరాలకు సంబంధించి అధికారులు 350 మంది రైతులకు ఎకరాకు రూ.14 లక్షల చొప్పున పరిహారం అందజేశారు.



సర్వే చేసేందుకు వచ్చిన అధికారి కాళ్లు మొక్కుతున్న రైతు

14 ఎకరాలు కోల్పోతున్నాం..



మా తాతల నాటి నుంచి ఈ భూమినే నమ్ముకొని బతుకుతున్నాం. సర్వే నంబర్ 355లో మాకు 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వ్యవసాయంతో పాటు ఆయిల్ పాం, కాస్మోటిక్ ఆయిల్ మిషన్, గేదెల షెడ్డు ఉన్నాయి. మార్కెట్ విలువ ప్రకారం ఎకరాలకు రూ.35 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం స్పష్టమైన హామీతో పరిహారం ఇస్తేగానీ భూములను వదులుకోలేం.

– శ్రీనివాస్‌రెడ్డి, భూ నిర్వాసిత రైతు. కాన్‌కుర్తి

భూమి పోతే బతుకు కష్టమౌతుంది..



ఉన్న ఎకరన్నర భూమిని కోల్పోతే.. బతకడం కష్టమవుతుంది. మాది నిరుపేద కుటుంబం, భూమిని వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నా.. ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇస్తే చాలనుకున్నాం. బలవంతంగా భూ సేకరణ చేస్తే ప్రాణాలైనా వదులకుంటాం.. కానీ భూమి వదలం.

– భీమప్ప, భూ నిర్వాసిత రైతు, కాన్‌కుర్తి

2013 ప్రకారం పరిహారం ఇవ్వాలి..

తొలి రెండు ప్యాకేజీల్లో మక్తల్, నారాయణపేట నియోజకవర్గాల పరిధిలో కాట్రేవులపల్లి నుంచి కానుకుర్తి వరకు చేపట్టిన భూసేకరణ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ఆయా మండలాల భూ నిర్వాసిత రైతులు ఎకరాకు రూ.14 లక్షల పరిహారం సరిపోదంటూ భూ సేకరణను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. రాస్తారోకోలు, ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి వంటి కార్యక్రమాలతో సుమారు 45 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. నారాయణపేటలో రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. తాము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని.. బహిరంగ మార్కెట్ విలువననుసరించి 2013 చట్ట ప్రకారం పరిహారం, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంతవరకూ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరిస్తున్నారు.

స్పందించకపోవడంతో..

భూ నిర్వాసితుల ఆందోళనలతో సీఎం ఇలాకా అట్టుడుకుతుండడంతో మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఇటీవల నిర్వాసితులతో మాట్లాడారు. వారితో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహతో హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. పరిహారం పెంచాలని.. ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్వాసితులు కోరగా.. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని దామోదర వెల్లడించారు. వారం రోజులైనా ఇప్పటి వరకు సీఎం, మంత్రుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో నిర్వాసితులు ఆందోళనలు ఉధృతం చేసినట్లు స్పష్టమవుతోంది.

యూరియా రగడ

ఒక్క బస్తా దొరికినా చాలంటున్న రైతులు



భూత్పూర్‌లో రోడ్డుపై ధర్నా చేస్తున్న అన్నదాతలు

- పీఏసీఎస్‌ల ఎదుట గంటల తరబడి బారులు
- భూత్పూర్‌లో మరోసారి రోడ్డెక్కిన అన్నదాతలు
- ఆగస్టులో 9,036 మెట్రిక్ టన్నులకు 5,533 మెట్రిక్ టన్నులే సరఫరా
- జూన్, జూలై నెలల్లోనూ ఇదే పరిస్థితి

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఏరువాకకు అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇక వేసే పంటలకు దిగులు లేదు. దిగుబడులు గ్యారెంటీ అని మురిసిపోయారు. చివరికి వేసిన పంటలకు యూరియా కొరత ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా పది రోజుల నుంచి ఎక్కడ చూసినా యూరియా కోసం తండ్లాడుతున్నారు. ఎక్కడ చూసినా.. క్యూ లైన్‌లు, చెప్పుల వరుసలు కన్పిస్తున్నాయి. ఓవైపు సొసైటీల వద్ద రాత్రుళ్లు పిండి బస్తాల కోసం నిద్రిస్తున్నారు. కనీసం ఒక్క బస్తా దొరికితే చాలని వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా గంటల తరబడి వేచి చూస్తున్నారు. అధికారులు ఈ సీజన్‌కు సరిపడా యూరియా ఉందని చెబుతున్నప్పటికీ.. ఎవరికీ నమ్మకం కుదరడం లేదు. పీఏసీఎస్ కేంద్రాల వద్ద, ఎరువుల దుకాణాల వద్ద రైతులే కనిపిస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల రోడ్డెక్కి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రహదారులపై బైఠాయించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యూరియా కొరతపై ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తున్నారు. భూత్పూర్‌లో మరోసారి రైతులు శుక్రవారం రోడ్డెక్కి ధర్నా చేశారు.

తప్పిన అధికారుల అంచనాలు

జిల్లాలో 3.64 లక్షల ఎకరాల్లో సాగ చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఈసారి రైతులు ఎక్కువగా వరికి మొగ్గు చూపుతున్నారు. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ఇస్తుండటంతో అన్నదాతలు వరి వైపే మొగ్గు చూపారు. గతేడాది 1,70,445 ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించగా, ఈ ఏడాది 2,00,000 ఎకరాలకు పెంచారు. ఇప్పటివరకు 1,67,118 ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేశారు. వానాకాలం సీజన్‌లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న విత్తనాలతో పాటు 38,574 మెట్రిక్ టన్నుల ఎరువులను అందించాలని నిర్ణయించారు. కానీ రైతులకు అవసరమైన యూరియా అందించడంలో అంచనాలు తప్పాయి. ఆగస్టు మాసంలో 9,036 మెట్రిక్ టన్నులకు 5,533 మెట్రిక్ టన్నులనే సరఫరా చేశారు. ఈసారి వర్షాలు విస్తారంగా కురయడంతో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు పెద్దమొత్తంలో సాగు చేశారు. జూలై నెలాఖరుకు వర్షాలు ప్రారంభమై ఆగస్టులో సాధారణ వర్షపాతం మించి వర్షాలు కురిశాయి. ఫలితంగా వరి నాట్లు పెరిగి, యూరియా అవసరం ఏర్పడింది. వర్షాకాలం ప్రారంభంలో 20 శాతం వరి సాగు కూడా జరగలేదు. ఆగస్టు ప్రారంభం నుంచి వర్షాలు బాగా పడడంతో వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులకు కావాల్సిన యూరియాను అందించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు మండిపడుతున్నారు.

వారం రోజులుగా తిరుగుతున్నా



మా గ్రామంలో సొంతంగా ఐదెకరాల పొలం ఉండగా.. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని మొత్తం పదెకరాల్లో వరి వేశాను. ఉదయం 6 గంటలకు వచ్చి యూరియా కోసం లైన్‌లో నిలబడ్డా. వారం రోజులుగా తిరుగుతున్నా.. ఇంతకు ముందు యూరియా ఇంత కష్టం రాలేదు. కేవలం టోకెన్ ఇచ్చి పంపిస్తున్నారు.

– శంకరమ్మ, హస్నాపూర్, భూత్పూర్ మండలం

తెలిసినోళ్లకే ఇస్తున్నారు..



మూడెకరాల పొలంలో వరి నాట్లు వేశాను. నాలుగు సార్లు భూత్పూర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణానికి తిరిగినా యూరియా దొరకడం లేదు. వాళ్లకు తెలిసినోళ్లకు బస్తాలు.. బస్తాలు ఇస్తున్నారు. మా లాంటి వారికి యూరియా లేదని చెబుతుండ్రు. ఎక్కడ చూసినా స్టాక్ లేకపోవడంతో పొలం పనులు వదులుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

– శంకరయ్య, రైతు, శేరిపల్లి(హెచ్), భూత్పూర్ మండలం

యూరియా వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

అవసరం	కేటాయింపు
38,574	21,376

ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించింది. శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ యూరియా పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరగడానికి వీల్లేదని, గుళికలు, ఇతర మందులు కొనుగోలు చేస్తేనే యూరియా అమ్ముతామని లింక్ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.యూరియాను ఎంఆర్పీ ధరల కంటే అధిక రేటుకు బ్లాక్ మార్కెట్‌లో అమ్మితే డీలర్‌ల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నానోయూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని డీలర్స్‌కు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, డీలర్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు పార్టీలు సహకరించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

- అఖిల పక్ష పార్టీల సమావేశంలో కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్థానిక సంస్థల ఎన్నికలకు వివిధ రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ విజయేందిర విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ లిస్టు, ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. అందులో ఏమైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 30వ సాయంత్రం లోపు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తెలియజేయాలన్నారు. ఎంపీడీఓలు వాటిని పరిశీలించి.. తగు సవరణలు చేసి తుది జాబితా ప్రచురణ కోసం జిల్లా పంచాయతీ అధికారి సమర్పించాలన్నారు. సెప్టెంబర్ 2వ తేదీన వార్డు వారీగా తుది ఫొటో ఓటర్ జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి ఓట్లు, దొంగ ఓట్ల తొలగించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఒక వార్డులోని ఓటు మరో వార్డులో ఉంటే వాటిని వెంటనే తెలియ జేయాలన్నారు. వార్డులు వారీగా, గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా షెడ్యూల్‌పై అవగాహన కల్పించారు. మండలస్థాయిలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీపీఓ పార్థసారధి, బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధులు బెక్కం జనార్దన్, సత్యంయాదవ్, కాంగ్రెస్ ప్రతినిధి సిరాజ్‌ఖాద్రి, వైఎస్‌ఆర్‌సీపీ ప్రతినిధి శ్యాముల్, బీజేపీ రాజేశ్వర్ రెడ్డి, సీపీఎం మోహన్ పాల్గొన్నారు.

స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లిలోని అమరరాజా గిగా ఫ్యాక్టరీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సుమారు 500 మందిలో 74 మంది మాత్రమే స్థానికులు ఉన్నారన్నారు. మిగిలిన వారంతా యూపీ, బిహార్, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన వారేనన్నారు. జడ్చర్ల – పోలేపల్లి సెజ్ మొదలుకుని జిల్లాలోని అనేక పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, షాపింగ్ మాల్స్‌లో వేలాది మంది వలస కార్మికులను యాజమాన్యాలు పనిలో పెట్టుకుని వేతనాలు సరిగ్గా చెల్లించడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీతో పాటు కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వెంటనే కార్మిక, పరిశ్రమల, పీఎఫ్ అధికారులు సంయుక్తంగా విచారణ జరిపి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సువర్ణరాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, నాయకులు కమర్‌అలీ, వేణుగోపాల్, గోనెల రాములు, రాజ్‌కుమార్, వెంకటేష్‌గౌడ్, నారాయణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



కేసులను పారదర్శకంగా విచారణ జరపాలి



అడ్డాకుల ఠాణాలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎస్పీ జానకి

అడ్డాకుల: పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే కేసులను విచారణ అధికారులు పారదర్శకంగా విచారణ జరిపి నిందితులకు శిక్ష పడే విధంగా పని చేయాలని ఎస్పీ డి.జానకి అన్నారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన రికార్డులు, ఫైళ్ల నిర్వాహణపై ఆరా తీశారు. రౌడి షీటర్లు, సస్పెక్ట్ షీట్లు, ఇసుక అక్రమ రవాణా, ఇతర అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సేవలపై ఆరా తీసి సమస్యలను తెలుసుకున్నారు. విధుల విభజన ప్రకారం ప్రజలకు సమర్థవంతంగా సేవలందించాలని, ఠాణాకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. అనంతరం ఠాణా ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోశారు.

ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

అడ్డాకుల పోలీస్ స్టేషన్ పరిధిలో 44వ నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉన్నందున రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రమాదాల నివారణపై పోలీసులు దృష్టి సారించాలని ఎస్పీ జానకి సూచించారు. రోడ్డు భద్రతా చర్యలపై పోలీసులు ప్రజలను చైతన్యం చేసే విధంగా చూడాలని చెప్పారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా, మద్యం మత్తులో బైకులను నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. హైవేపై పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు. అనంతరం మూసాపేట మండలం వేముల ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ వద్దకు వచ్చే నెల 3న సీఎం రేవంత్‌రెడ్డి రానున్న నేపథ్యంలో కంపెనీని ఎస్పీ సందర్శించారు. అలాగే మూసాపేటలో ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేసే అవకాశం ఉన్నందున చివరి దశ పనులు జరిగే ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ, అడ్డాకుల, మూసాపేట ఎస్ఐలు శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో దీర్ఘకాలిక ప్రయోజనం
- తెలంగాణ రెడ్‌కో చైర్మన్ శరత్

ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నల్లమలలో దారితప్పిన ఇద్దరు వ్యక్తులు
- ఫోన్ లొకేషన్ ద్వారా అర్ధరాత్రి రక్షించిన పోలీసులు

- వివరాలు 8లో...

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

గద్వాల క్రైం: అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా దాచేపల్లి మండలానికి చెందిన రాజు (38) అయిదు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి కోసం జిల్లాకు వలస వచ్చాడు. ఈ క్రమంలో గద్వాల పట్టణంలోని పిల్లిగుండ్ల కాలనీలో తాత్కాలిక గుడిసెలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉండి, పుట్టు వెంట్రుకల క్రయవిక్రయాలు చేస్తు జీవనం సాగిస్తున్నారు. అయితే శుక్రవారం తెల్లవారుజామున రింగ్‌రోడ్డు సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులు, బంధువులకు సమాచారం అందించగా.. వారు ఘటన స్థలానికి చేరుకుని రాజును చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. రాజు మృతిపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారం కోసం పలువురితో అప్పులు తీసుకున్నట్లు కుటుంబ సభ్యులతో చెప్పాడన్నారు. అప్పులు తీర్చేందుకు స్థోమత లేకపోవడంతో తీవ్ర మనస్థాపం చెంది బలవన్మరణానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య నాగమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి అన్న అంజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ఇద్దరికి గాయాలు



ఎర్రవల్లి: ముందు వెళ్తున్న లారీని వెనక నుంచి వచ్చిన ఇన్నోవా వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్‌ఐ మురళి కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన విజయ్ కుమార్ (60) తన కుమార్తె నందితను శంషాబాద్ విమానాశ్రయంలో వదిలేందుకు భార్య మాధవితో కలిసి ఇన్నోవా వాహనంలో గురువారం రాత్రి బయలుదేరారు. శుక్రవారం ఉదయం విమానాశ్రయంలో వదిలి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా 44వ నంబర్ జాతీయ రహదారిపై ధర్మవరం స్టేజీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొని అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇన్నోవాలో ఉన్న విజయ్‌కుమార్, డ్రైవర్ కళ్యాణ్‌బాబుకు తీవ్ర గాయాలు, మాధవికి స్వల్ప గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే విజయ్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు నయన్‌కాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధరూరు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ధరూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన సత్యన్న (39) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద రెండు ఎకరాలు భూమి కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. ఈ క్రమంలో వర్షాల కారణంగా వరి పంట నీట మునిగిపోవడంతో ఆ బాధలో విపరీతంగా మద్యం తాగుతున్నాడు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం మద్యం తాగొద్దని భార్య వారించడంతో క్షణికావేశానికి లోనై గడ్డి మందు తాగాడు. అప్పటి నుంచి గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య మహేశ్వరితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మళ్లీ పెరిగిన వరద ఉధృతి



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

జూరాల 24 గేట్లు ఎత్తి దిగువకు విడుదల

ధరూరు/ఆత్మకూర్/దేవరకద్ర: ప్రియదర్శిని జూరాల జలాశయానికి శుక్రవారం వరద స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం 1.80 లక్షల క్యూసెక్కులు ఉండగా.. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో 1.95 లక్షల క్యూసెక్కులకు పెరిగిందన్నారు. 24 క్రస్ట్ గేట్లను పైకెత్తి 1,23,768 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నామని.. విద్యుదుత్పత్తి నిమిత్తం 33,403 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 22, నెట్టెంపాడుకు 750, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 490 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.261 టీఎంసీలుగా ఉందన్నారు.

వేగంగా విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుందని ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎగువన 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 258.622 మి.యూ, దిగువన 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 289.916 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టినట్లు వివరించారు. ఇప్పటి వరకు 547.538 మి.యూ. ఉత్పత్తి సాధించామని చెప్పారు.

కోయిల్‌సాగర్ 2 గేట్లు తెరిచి..

శుక్రవారం కోయిల్‌సాగర్ జలాశయం రెండు గేట్లు ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. గురువారం వరద తక్కువగా ఉండటంతో ఒక గేటు తెరిచామని.. శుక్రవారం ఉదయం పెరగడంతో మరో గేటు ఎత్తినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. ప్రస్తుతం 32 అడుగులు ఉందన్నారు.

హత్య కేసులో ఆరుగురి అరెస్టు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పెద్దకొత్తపల్లి: కోడేరు మండలం మైలారం గ్రామానికి చెందిన అనుముల రంగస్వామి హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో హత్యకేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అనుముల రంగస్వామికి అచ్చంపేటలో నివాసముంటున్న పులేందర్‌గౌడ్ అలియాస్ పుల్లయ్యగౌడ్‌తో కొంతకాలం క్రితం పరిచయమైంది. ఇరువురు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలోనే తనకు తెలిసిన చోట గుప్తనిధులు ఉన్నాయని.. వాటిని వెలికితీసేందుకు స్వామిజీ ఉన్నాడని.. డబ్బులు ఇస్తే గుప్తనిధులు తీసిస్తాడని రంగస్వామి పులేందర్‌గౌడ్‌కు చెప్పడంతో రూ. 5లక్షలు ఇచ్చాడు. అయితే గుప్తనిధులు ఇవ్వకపోగా.. మరో రూ. 5లక్షలు ఇవ్వాలని రంగస్వామి డిమాండ్ చేశాడు. అందుకు పులేందర్‌గౌడ్ నిరాకరించాడు. అయితే స్వామిజీ కన్నెర్రజేస్తే నివ్వు, నీ కుటుంబం మాడి మసైపోతారని భయపెట్టడంతో రంగస్వామిని ఎలాగైనా హతమార్చాలని పులేందర్‌గౌడ్ పథకం రచించాడు. ఈ మేరకు జూలై 29న డబ్బులు ఇస్తానని రంగస్వామిని జడ్చర్లకు పిలిపించుకున్నాడు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లి తన తమ్ముడు సత్యేశ్వరంగౌడ్ ఇంట్లో చికెన్‌లో మత్తు మందు కలిపి రంగాస్వామికి తినిపించారు. స్పృహ కోల్పోయిన రంగాస్వామిని రమేశ్ అనే వ్యక్తి వాహనంలో ఎక్కించుకొని బల్మూర్ మండలం మైలారం గ్రామంలోని మామిడితోటకు తీసుకెళ్లాడు. అప్పటికే తోటలో పనిచేసే రమేశ్ తండ్రి గోతి తీసి ఉంచగా.. అందులో రంగాస్వామిని పడేశారు. ఈ క్రమంలోనే స్పృహలోకి వచ్చిన రంగాస్వామిని శివ గడ్డపారతో తలపై రెండసార్లు బలంగా మోదడంతో మృతిచెందాడు. మృతదేహంపై ఉప్పు, మట్టి వేసి పూడ్చివేశారు. నిందితులు అక్కడే మద్యం తాగి ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అయితే రంగస్వామి అదృశ్యమైనట్లు ఈ నెల 4న అతడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు పెద్ద కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కాల్ డేటా ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి తమదైన శైలిలో విచారించడంతో చేసిన నేరాన్ని అంగీకరించారు. నిందితులు పులేందర్‌గౌడ్, శివ, కర్ణాటి సుధాకర్, జక్కుల తిరుపతయ్య, పలుస భాస్కర్‌గౌడ్‌లను అరెస్టు చేయగా.. రమేశ్ అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 6 సెల్‌ఫోన్లు, రెండు గడ్డపారాలు, ఒక పార, తుఫాన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కొల్లాపూర్ సీఐ మహేశ్, ఎస్‌ఐలు సతీష్, జగదీశ్వర్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని టీడీగుట్టలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో వన్‌టౌన్ ఎస్‌ఐ శీనయ్య తన బృందంతో దాడులు నిర్వహించి.. రాకేశ్ అనే యువకుడి నుంచి రూ. 33వేల విలువజేసే 1.325 కేజీల గంజాయిని పట్టుకున్నారు. మరి కొంత గంజాయిని మరో ఇద్దరికి విక్రయించినట్లు విచారణలో తేలిందని.. వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి డ్రగ్ టెస్టింగ్ కిట్లతో తనిఖీ చేయగా.. గంజాయి తాగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీసులకు పట్టుబడిన రాకేశ్ గతంలో కూడా పలువురికి గంజాయి విక్రయించినట్లు తేలిందని.. వారందరి వివరాల సేకరిస్తున్నామని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ అప్పయ్య, ఎస్‌ఐ శీనయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేళాయె..

- నేటి నుంచి పీయూలో 11వ రాష్ట్ర అథ్లెటిక్స్ జూనియర్ చాంపియన్‌షిప్
- 157 ఈవెంట్స్‌లో పాల్గొనున్న 1,150 మంది క్రీడాకారులు



పీయూ సింథటిక్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శనివారం నుంచి జి.రాజేంద్రప్రసాద్ స్మారక 11వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు పీయూలోని సింథటిక్ ట్రాక్ వేదిక కానుంది. ఇప్పటికే నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 157 ఈవెంట్స్‌లో అండర్–14, 16,18,20 విభాగాలకు చెందిన 1,150మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. పలు జిల్లాల నుంచి క్రీడాకారులు శుక్రవారం సాయంత్రమే పీయూకు చేరుకున్నారు. ఈవెంట్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు శిల్పిరామంలో పురుషులకు , దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ శిశువికాస్‌లో బాలికలకు వసతి కల్పించారు. ఇక పీయూ గ్రౌండ్‌లో భోజన వసతి కల్పించనున్నారు. ఈవెంట్స్‌కు సంబంధించిన ఏర్పాట్లను మూడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు ఎన్పీ వెంకటేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నాయకులు శరత్‌చంద్ర, సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. పోటీల ప్రారంభోత్సవానికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి హాజరవుతారన్నారు. ఈవెంట్స్ నిర్వహణకు 30మంది కోచ్‌లు, 35మంది టెక్నికల్ అఫీషియల్స్, 30మంది వలంటీర్లను కేటాయించినట్లు తెలిపారు.

అమ్రాబాద్‌కు సాగునీరు ఇవ్వండి



మాట్లాడుతున్న అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి

మన్ననూర్: చంద్రసాగర్ నుంచి ఎత్తిపోతల ద్వారా ఉమ్మడి అమ్రాబాద్ మండలానికి సాగునీరు అందించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రాఘవాచారి అన్నారు. శుక్రవారం అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామంలోని అంబేడ్కర్ కూడలిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి గురించి మాట్లాడాలంటే కూడా ధైర్యం కావాలని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు ఆ ధైర్యం లేకనే జిల్లా ఇప్పటి వరకు కూడా వెనుకబాటుకు గురవుతూనే ఉందని విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్లు తెలంగాణను పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్లలో రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం నిర్మించింది.. కానీ, అమ్రాబాద్ మండలంలోని సుమారు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించడంలో అప్పటి బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కపట ప్రేమ ఒలక బోస్తున్నాయని దుయ్యబట్టారు. గతంలో చేసిన ప్రతిపాదనలను నల్లగొండ జిల్లా మంత్రులు వారి స్వార్థ రాజకీలకు వాడుకున్నారని ఎద్దేవా చేశారు. డిండి, ఎస్ఎల్‌బీసీ, ఎలిమినేటి మాధవరెడ్డి ఎడమకాల్వ ద్వారా పూర్తిగా నీటిని దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు తరలించుకెళ్లి నల్లగొండను సస్యశ్యామలం చేసుకోవాలనుకుంటున్నారన్నారు. నల్లగొండ మంత్రులు అనుకున్నట్లుగా ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచిస్తే చంద్రసాగర్ నుంచి సుమారు 10 కి.మీ. దూరంలోనే అమ్రాబాద్ మండలంలోని పొలాల్లో నీళ్లు పారుతాయని చెప్పారు. సమావేశంలో నియోజకవర్గం కన్వీనర్ గాజుల లక్ష్మీనారాయణ, అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలకిష్టయ్య, స్వామి, అధ్యయన వేదిక కల్వకుర్తి కన్వీనర్ అశోక్, మోహన్, నిరంజన్, చెన్నయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్‌తో దీర్ఘకాలిక ప్రయోజనం



మాట్లాడుతున్న తెలంగాణ రెడ్‌కో చైర్మన్ శరత్

నాగర్‌కర్నూల్: రాష్ట్ర ప్రభుత్వం సౌరశక్తి వినియోగాన్ని విస్తృతం చేయాలని కృతనిశ్చయంతో ముందడుగు వేస్తోందని తెలంగాణ రెడ్‌కో చైర్మన్ శరత్ తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో ఆయన కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ దేవసహాయం, విద్యుత్ శాఖాధికారులు, రెడ్కో అధికారి మనోహర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్‌తో కరెంట్ ఆదా, పర్యావరణ పరిరక్షణ, తక్కువ నిర్వహణ ఖర్చులు వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. రాష్ట్రంలో భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన విద్యుత్ సరఫరా నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా పలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అమ్రాబాద్ మండలంలోని మాచారంలో అమలు జరుగుతున్న ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం వివరాలను కలెక్టర్ వివరించారు. అలాగే కొండారెడ్డిపల్లిలో ఏర్పాటు చేస్తున్న సౌర విద్యుత్ ప్లాంట్ పురోగతిని కూడా సమీక్షించారు.

ప్రతి ప్రభుత్వ కార్యాలయంపై..

ప్రభుత్వ కార్యాలయాలన్నింటి మీద సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని, పంచాయతీ భవనాల నుంచి కలెక్టరేట్ వరకు సౌరశక్తి వినియోగం విస్తరించాలనే సంకల్పాన్ని వివరించారు. ప్రారంభ పెట్టుబడి తప్ప మరిన్ని ఖర్చులు లేకుండా సౌర శక్తి దీర్ఘకాలిక లాభాలు అందిస్తుందని, దీనివల్ల శబ్ద కాలుష్యం లేదా వ్యర్థాల సమస్యలు రాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ డిమాండ్‌ను తీర్చే విధంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, గురుకులాలపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసే ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ శాఖకు చెందిన ఖాళీ స్థలాల్లో కూడా సౌర ప్లాంట్లను ఏర్పాటు చేయాలని సంకల్పించామని, దీనికి అనుగుణంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన భూ వైశాల్యం, నెలవారీ విద్యుత్ వినియోగ వివరాలను మండల స్థాయిలో సేకరించి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిపారు.

ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.200 కోట్లు



ఇంటి స్థల పట్టా అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి.. చిత్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి త్వరలోనే మరో రూ.200 కోట్లు విడుదల కానున్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముంపునకు గురవుతున్న చిన్నగుట్ట తండాలో నిర్వహించిన ఇంటి స్థలాల పట్టాల పంపిణీకి ఆయనతో పాటు కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఒంటిగుడిసెతండా, చిన్నగుట్టతండా, రేగడిపట్టతండా, తుమ్మలకుంటతండాకు చెందిన 237 నిర్వాసితులకు వారు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే రిజర్వాయర్ పరిధిలోని వల్లూరుతో పాటు ఐదు గిరిజన తండాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందజేశామని.. ఇక మిగిలింది ఉదండాపూర్ గ్రామం మాత్రమేనని, ఆర్‌అండ్‌ఆర్ మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. త్వరలోనే అవార్డ్ పాస్ చేయించి గ్రామ నిర్వాసితులకు ప్యాకేజీ పరిహారాన్ని అందజేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిర్వాసితులకు మౌలిక సదుపాయాలతో కూడిన ఇంటి స్థలాలను కేటాయించామని పేర్కొన్నారు. ఆయా స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఆర్డీఓ నవీన్‌కుమార్, తహసీల్దార్ నర్సింగరావు, పుర చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఇద్దరు పాలమూరు క్రీడాకారులు



రాజా రాంచరణ్



రాజేశ్వరి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని కౌకుంట్లకు చెందిన రాజా రాంచరణ్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పంజాబ్ రాష్ట్రం లూధియానాలో వచ్చేనెల 1 నుంచి జరిగే జాతీయస్థాయి యూత్ అండర్–18 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టుకు ఎంపికయ్యాడు. రాజా రాంచరణ్ 2023లో అండర్–14 విభాగం పాండిచ్చేరి, 2024 అండర్–16 విభాగం కోల్‌కత్తాలో జరిగిన జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ బాలుర జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఇప్పుడు మూడో జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నాడు. అదే విధంగా ఇదే జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాస్కెట్‌బాల్ జట్టుకు బాలానగర్‌లోని ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి ఎస్.రాజేశ్వరి ఎంపికైంది. వీరి ఎంపికపై జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మక్సూద్ బిన్ అహ్మద్ జాకీర్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి నసరుల్లా హైదర్, సభ్యులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటి ఉమ్మడి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

చోరీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

నారాయణపేట క్రైం: చోరీ కేసులో ఓ నిందితుడికి ఏడు నెలల 8 రోజులు జైలుశిక్ష విధించినట్లు నారాయణపేట సీఐ శివశంకర్ శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జిల్లాకేంద్రానికి చెందిన లక్ష్మి గతేడాది జూన్ 14న స్థానిక బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా బ్యాగ్‌లో నుంచి రూ.6 వేల నగదు, 6 గ్రాముల బంగారం అపహరణకు గురైందని, అలాగే అదే ఏడాది మార్చి 12న మాగనూరు మండలం, నేరేడ్‌గం గ్రామానికి చెందిన కవిత నారాయణపేటలో విధులు ముగించుకొని బస్టాండ్‌లో బస్సులో సీటు కోసం తన హ్యాండ్‌బ్యాగ్ వేయగా అపహరణకు గురైందని అందులో రూ.30 వేలు, తులం బంగారం, ఏటీఎం , ఐడీ కార్డులు ఉన్నాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి విచారణ చేసి నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపరచగా కోర్టు డ్యూటీ ఆఫీసర్ అరవింద్‌కుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా ఏపీపీ సురేష్ కోర్టులో వాదనలు వినిపించగా ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం జడ్జి శుక్రవారం రెండు కేసులకు సంబంధించి తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు. నిందితునికి శిక్ష పడడంలో కృషిచేసిన పోలీస్ అధికారులను, ఏపీపీ సురేష్‌ని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు.

300 యూరియా బస్తాలు స్వాధీనం

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలం వెల్టూరులో ఉన్న రామలింగేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన 300 యూరియా బస్తాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం దాడి చేసి పట్టుకున్నారు. రైతులకు తక్కువ ధరకు అందించాల్సిన యూరియాను కొందరు దళారుల సహకారంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలకు కేటాయించి, అక్కడి నుంచి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు సమాచారం. యూరియా పీఏసీఎస్ నుంచి వచ్చిందా లేక ఇతర మార్గాల్లో అక్రమంగా తెచ్చారా అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేపడుతున్నారు. యూరియాను స్వాధీనం చేసుకొని యజమానిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

నల్లమలలో దారితప్పిన ఇద్దరు వ్యక్తులు

ఫోన్ లొకేషన్ ఆధారంగా రాత్రి 12 గంటల సమయంలో రక్షించిన పోలీసులు



నల్లమలలో దారితప్పిన ఇద్దరు వ్యక్తులను రక్షించిన పోలీసులు, గ్రామస్తులు

లింగాల: మండలంలోని అప్పాయపల్లి అటవీ ప్రాంతంలో దారితప్పిన ఇద్దరు వ్యక్తులను ఫోన్ లొకేషన్ ఆధారంగా రంగంలోకి దిగిన పోలీసులు రక్షించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి గ్రామానికి చెందిన జంపయ్య, వెంకటస్వామి గొర్రెలకు సోకే వ్యాధులకు అవసరమైన చెట్ల మందు పసరు కోసం గురువారం ఉదయం లింగాల మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతానికి వెళ్లారు. వారు మధ్యాహ్న సమయంలో అప్పాయపల్లి, గిరిజ గుండాల ప్రాంతంలో దారి తప్పారు. దారి తప్పినట్లు గుర్తించిన వారు రాత్రి 7 గంటల సమయంలో అప్పాయపల్లిలో ఉన్న బంధువు మొగిలి నిరంజన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఫోన్ చేసిన ప్రాంతంలోనే ఉండాలని అక్కడి నుంచి కదలవద్దని నిరంజన్ చెప్పి వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు. పలువురు అప్పాయపల్లికి చెందిన గ్రామస్తులతో కలిసి లొకేషన్ ఆధారంగా వారిని గుర్తించారు. తప్పిపోయిన ఇద్దరు వ్యక్తులు బాణాల సమీపంలోని రుసుల్ చెర్వు అలుగు వెళ్లే వాగు దగ్గర రాత్రి 12 గంటలు అయినప్పటికీ అక్కడే ఉన్నారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడం గమనించి అవతలి గట్టుపై ఉన్న వారికి తాడును అందించగా వారు దానిని పట్టుకొని ఇవతలికి వచ్చారు. గ్రామస్తులు సకాలంలో సమాచారం ఇవ్వడంతో వారికి ఎలాంటి అపాయం జరగలేదని ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాములు, హుస్సేన్, ప్రజలు మొగిలి నిరంజన్, కృష్ణ, చందర్, సంతోష్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం



మాట్లాడుతున్న ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి సంవత్సరంలో 191 మంది విద్యార్థులను అలాట్ చేసిందని, వారికి కళాశాలలో ఎలా నడుచుకోవాలని, ర్యాగింగ్, కోర్సుల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఓరియంటేషన్ అనంతరం మధ్యాహ్నం బాలబాలికలకు హాస్టల్స్‌లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబుతో పాటు పలువురు హాజరవుతారన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులు తప్పకుండా కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని సూచించారు. త్వరలో తరగతులు ప్రారంభం అవుతాయని, ఇప్పటికే తరగతి గదులు, హాస్టల్ గదులను సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో మోహినుద్దీన్, పీఆర్‌ఓ గాలెన్న తదితరులు పాల్గొన్నారు.